## బియ్యం ఎగుమతులపై ఆంక్షల ఎత్తివేత..

న్యూఢిల్లీ: పండుగల వేళ దేశంలో బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న పరిస్థితుల్లో బియ్యం ధరలు పెరుగుతుండటం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కేవలం వారం రోజుల్లో దేశంలో బియ్యం ధరలు దాదాపు 10-15 శాతం వరకు పెరిగాయి. బియ్యం ఎగుమతులపై ఆంక్షలను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. ప్రపంచ బియ్యం మార్కెట్‌లో భారత్ వాటా 45 శాతం వరకు ఉంటుంది. భారత్ నుంచి ప్రధానంగా ఇరాన్, సౌదీ అరేబియా, చైనా, యూఏఈ, ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతి అవుతుంది. అయితే, బాస్మతీయేతర బియ్యంపై ఎగుమతులపై కేంద్రం గత ఏడాది ఆంక్షలు విధించడంతో పాటు పారాబాయిల్డ్ బియ్యంపై సుంకాన్ని 20 శాతానికి పెంచింది. బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షలను తొలగించడంతో పాటు పారాబాయిల్డ్ బియ్యంపై సుంకాన్ని 10 శాతానికి తగ్గిస్తూ సెప్టెంబర్ 28న కేంద్రం నిర్ణయం తీసుకుంది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :201 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 11-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా



హైదరాబాద్,దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతిపట్ల తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని పేర్కొన్నారు.సమాజ హితుడుగా వారి తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆదర్శం అని అన్నారు. రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకోసం జీవితకాలం తపించిన రతన్ టాటా ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలని కేసీఆర్ ఆకాంక్షించారు.'ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా. సమాజ హితుడుగా వారి తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆదర్శం. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామిక వేత్త టాటా. సమాజ సంక్షేమం కోసం, రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం జీవితకాలం తపించిన ఆయన ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలి' అని కేసీఆర్ పేర్కొన్నారు.నాటి బీఆర్ఎస్ ప్ర భుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై.. నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక పారిశ్రామిక రంగాల్లో నాటి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణకు గర్వకారణ మని కేసీ ఆర్ స్మరించుకున్నారు.మానవతావాది టాటా మృతి భారత పారిశ్రా మిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటన్నారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మాజీ సీ ఎం ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఆధునిక భారత దేశ పారిశ్రామిక పితామహుడికి రాష్ట్రపతి,ప్రధాని నివాళి..


హైదరాబాద్ : భారత ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి పట్ల దేశవ్యాప్తంగా అనేక మంది సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా దేశంలోని పలువురు పారిశ్రామిక ప్రముఖులు కూడా తమ సంతాపాన్ని తెలియజేశారు. పద్మవిభూషణ్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రతన్ టాటా విషాద మరణంతో భారతదేశ కార్పొరేట్ అభివృద్ధికి దేశ నిర్మాణం, శ్రేష్ఠతను మిళితం చేసిన ఐకాన్‌ను కోల్పోయిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆయన టాటా వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లారని, దానికి మరింత ప్రభావవంతమైన ఉనికిని అందించారని ప్రస్తావించారు. దీంతోపాటు అనేక మంది నిపుణులను, యువ విద్యార్థులను ప్రేరేపించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో దాతృత్వానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని వెల్లడించారు.

దయగల అసాధరణ వ్యక్తి : ప్రధాని

రతన్ టాటా దూరదృష్టి గల వ్యాపార నాయకుడని, దయగల అసాధారణ వ్యక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భారతదేశంలో ప్రతిష్టాత్మకమైన వ్యాపార సంస్థలలో ఒకదానికి స్థిరమైన నాయకత్వాన్ని అందించారని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, పారిశుధ్యం, జంతు సంరక్షణ వంటి అనేక అంశాలకు మద్దతు ఇవ్వడంలో ఆయన ముందున్నారని తెలిపారు. ఇదే సమయంలో ఆయన సహకారం, వినయం, దయతో మన సమాజాన్ని మెరుగుపరచాలనే అచంచలమైన నిబద్ధతకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు ప్రధాని మోదీ.

ఆయన విజన్ ముందు తరాలకు మార్గదర్శకం: రాహుల్ గాంధీ.

రతన్ టాటా మృతి పట్ల ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా విజన్ ఉన్న వ్యక్తి అని రాహుల్ గాంధీ అన్నారు. ఆయన వ్యాపారం, దాతృత్వం రెండింటిలోనూ చెరగని



ముద్ర వేశారన్నారు. ఆ నేపథ్యంలో ఆయన కుటుంబానికి, టాటా గ్రూప్‌కు సానుభూతి తెలియజేశారు.

ఆయన మార్గదర్శకత్వంలోనే మేమందరం:అనంద్ మహీంద్రా.

మరో పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా రతన్ టాటా మృతికి సంతాపం తెలియజేశారు. నేడు భారత ఆర్థిక వ్యవస్థ చారిత్రాత్మకంగా దూసుకుపోతోందని అన్నారు. మనల్ని ఈ పరిస్థితికి తీసుకురావడంలో రతన్ టాటా జీవితంలో ఎంతో పనిచేశారని ప్రస్తావించారు. ఇలాంటి సమయాల్లో ఆయన మార్గదర్శకత్వం అమూల్యమైనదని కొనియాడారు.

ఆధునిక భారతదేశ పితామహుడు :గౌతమ్ అదాని..

భారతదేశ ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ కూడా రతన్ టాటా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. టాటా ఆధునిక భారతదేశ మార్గాన్ని పునర్నిర్వచించారని, ఆయన కేవలం వ్యాపార నాయకుడే కాదన్నారు. ఆయన సమగ్రత, కరుణ, మంచి కోసం అచంచలమైన నిబద్ధతతో భారతదేశ స్ఫూర్తిని మూర్తీభవించారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తిత్వాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని అదానీ వెల్లడించారు.

## మహారాష్ట్రకు తెలంగాణ ఆబ్కారీ సిబ్బంది

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో కల్తీ మద్యం, కల్తీ కల్లు అరికట్టేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. ఇప్పటికే కల్తీ మద్యంపై దృష్టి సారించగా.. దాడులు కొనసాగిస్తూనే ఉంది. అందులోనూ రాష్ట్రంలో దసరా పండుగ సీజన్ ఉండడంతో కల్తీ మద్యం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ఎక్సైజ్ దాడులు, తనిఖీలు చాలావరకు పెరిగాయి. మద్యం కల్తీ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.అలాగే.. రాష్ట్రాన్ని కల్తీ కల్లు కూడా పట్టిపీడిస్తోంది. ఇప్పటికే చాలామంది కల్తీ కల్లుకు బలైన వారూ ఉన్నారు. కల్తీ బానిసలైన వారు కూడా వందల సంఖ్యలో ఉన్నారు. కల్తీ కల్లును నిర్మూలించేందుకు ఎంతగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. పొరుగు రాష్ట్రాల నుంచి ముఠాలు కల్తీ కల్లు కోసం వినియోగించే క్లోరోహైడ్రేట్ తీసుకొస్తున్నారు. దాంతో కల్తీ కల్లుతయారు చేసి తాగుబోతులకు కిక్కునిస్తున్నారు. ఫలితంగా దానికి బానిసలైన వారు.. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రధానంగా ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలు, తదితర కార్మికులు కల్తీ కల్లుకు బానిసలవుతున్నారు. అయితే.. ఇది కేవలం నగరాలు, పట్టణాలు, గ్రామాలకే పరిమితం కాకుండా.. ఈ బెడద హైదరాబాద్ మహానగరాన్ని సైతం వేధిస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో యథేచ్ఛగా కల్తీ కల్లు తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎన్ని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ ముఠాలు వాటిని పట్టించుకోవడం లేదు.కల్తీ కల్లుపై మరింత ఉక్కుపాదం మోపేందుకు ఎక్సైజ్అధికారులు భారీ ఎత్తున ప్లాన్ చేశారు. అందులో భాగంగా మహారాష్ట్రపై ఫోకస్ పెట్టారు. కల్తీకల్లు కోసం వినియోగించే క్లోరోహైడ్రేట్




మహారాష్ట్ర నుంచి తెలంగాణకు తీసుకొస్తున్నారని వారి తనిఖీల్లో వెల్లడైంది. దాంతో ఆబ్కారీ వాళ్లు భారీ ఆపరేషన్ చేపట్టారు. క్లోరోహైడ్రేట్ తయారు చేస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు మహారాష్ట్రకు చేరుకున్నాయి. అక్కడే నాలుగు రోజులు నిఘా వేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు క్లోరోహైడ్రేట్ సరఫరా చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. గత తొమ్మిది నెలలుగా పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే రామాగౌడ్ అనే ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అతడిని కస్టడీలోకి తీసుకొని విచారించగా.. ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. అందులో భాగంగా ఎక్సైజ్ సిబ్బంది మహారాష్ట్ర ఈ ఆపరేషన్ నిర్వహించాయి.

## జగన్ ని బీజేపీ వాడుకుని వదిలేసిందా ?



అమరావతి,వైసీపీ అధినేత జగన్ ది ముక్కుసూటి రాజకీయం. ఆయన ఒకసారి ఒకరిని ద్వేషించారు అంటే మళ్లీ దగ్గరకు రానీయరు. ఆయన పాలిటిక్స్ కూడా అలాగే సాగుతుంది. కానీ రాజకీయాలు అలా లేవు. ఇక్కడ ప్రత్యర్థులు ఎవరూ లేరు. శాశ్వత మిత్రులు శత్రువులు లేనిదే రాజకీయం అని అంటారు.చంద్రబాబుకు రాజకీయంలోని సూత్రాలు బాగా తెలుసు. జగన్ అయితే వాటిని కాకుండా తనదైన పంథాలో సాగుతున్నారు అని అంటూంటారు. అయితే నిజాయతీగా ఉంటే జనాలు గుర్తిస్తారు అని ఆయన భావన. కానీ అయిదేళ్ల పాటు వైసీపీ పథకాలు అమలు చేసినా టీడీపీ వాటికి రెట్టింపు ఇస్తామని చెప్పగానే లబ్దిదారులు అంతా అటు వైపు మళ్లారు.వారి మాటేమిటి జగన్ స్వయంగా సృష్టించిన సచివాలయ వ్యవస్థలో పనిచేసే లక్షా పాతిక వేల మంది ఉద్యోగులలో నూటికి తొంబై అయిదు శాతం కూటమి వైపే తిరిగిపోయారు అని ప్రచారం సాగింది. ఇక వాలంటీర్లు కూడా పదివేలు ఇస్తామంటే అటే పనిచేశారు అన్న ప్రచారమూ సాగింది.ఇలా రాజకీయం మారిపోయినపుడు బీజేపీ కేంద్ర పెద్దలు మాత్రం మారకుండా ఎలా ఉంటారని జగన్ అనుకున్నారో అని అంటున్నారు. బీజేపీ టీడీపీల మధ్య పొత్తులు విడాకులు అన్నవి గత పాతిక ఏళ్ళుగా అలా సాగుతూనే వస్తున్నాయి. 1999 లో పొత్తు పెట్టుకున్న టీడీపీ 2004లో ఎన్నికల్లో ఓటమి తరువాత బీజేపీని దూరం పెట్టింది.తిరిగి 2014లో బీజేపీని దగ్గరకు తీసుకుని పొత్తు అంది. 2019లో నో చెప్పేసింది. 2024లో మళ్లీ రెండు పార్టీలు కలిసాయి.ఈ విధంగా బీజేపీ టీడీపీ బంధం ఉంటే జగన్ మాత్రం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండదని భావించారని అంటారు.దానికి కారణం 2019 నుంచి 2024 మధ్యలో బీజేపీ వైసీపీని అంతలా ప్రాధాన్యత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం తన అవసరాలకు రాజ్యసభలో తన బిల్లులు పాస్ కావడానికి వైసీపీని అలా వాడుకుందని కూడా ప్రచారం సాగింది. తీరా ఎన్నికలు వచ్చేసరికి తమ పొత్తు టీడీపీతో అని ఆ వైపు మళ్ళింది అని అంటున్నారు. ఎన్నికల్లో బీజేపీ ఆ సైడ్ నిలబడడం వల్లనే అన్ని రకాలైన మేనేజ్మెంట్ స్కిల్స్ తో టీడీపీ కూటమి గెలిచింది అన్నది వైసీపీకి ఉన్న అతి పెద్ద అనుమానంగా చెబుతారు.ఇవన్నీ ఇలా ఉంటే మళ్లీ టీడీపీ బీజేపీల మధ్య చెడితే తానే ఆల్టర్నేషన్ గా కనిపిస్తాను అని వైసీపీ అధినాయక త్వం భావించి ఉండవచ్చు. కానీ ఇపుడు ఆ ప్లేస్ లోకి పవన్ వచ్చేశారు అని అంటున్నారు. ఆయనతో బీజేపీకి పొత్తు ఎప్పటికీ ఉంటుంది అని సంకేతాలు ఇస్తున్నారు. దాంతో ఏపీలో కూటమిలో లుకలుకలు వచ్చినా కేంద్రంతో టీడీపీ తలాక్ చెప్పినా వైసీపీకి మాత్రం రాజకీయంగా గతంలో ఉండే సీన్ అయితే లేదు.దాంతో ఏపీలో వైసీపీ ఒంటరిగా మారింది అని అంటున్నారు. కేంద్ర బీజేపీ పెద్దలు ఇక మీదట కానీ ఫ్యూచర్ లో కానీ వైసీపీ వైపు చూసే అవకాశాలు లేవని ఎట్టకేలకు ఆలస్యంగానే ఆ పార్టీకి అర్ధం అయింది అని అంటున్నారు. దానికి శ్రీవారి లడ్డూల ఇష్యూ కూడా దోహదపడింది అని అంటున్నారు.మొత్తానికి ఏపీలో వైసీపీని ఎలిమినేట్ చేయాలన్న టీడీపీ జనసేనల ప్లాన్ కి బీజేపీ ఫుల్ సపోర్టు ఇస్తోంది అన్నది బలపడిన తరువాతనే జగన్ ఇక బీజేపీతో తలాఖ్ చెప్పక తప్పదనే భావనకు వచ్చారా అనన్ చర్చ సాగుతోంది. రాజకీయాల్లో స్నేహాలు ఉండవని బంధాలు అంతకంటే ఉండవని వైసీపీ హై కమాండ్ ఎంత తొందరగా తెలుసుకుంటే అంత ఎక్కువగా వేగంగా మేలు జరుగుతుందని అంటున్నారు. సో ఇక మీదట వైసీపీ అడుగులు ఎలా ఉంటాయో తెలియదు కానీ ఆ పార్టీ అధినాయకత్వం మధనం మాత్రం రాజకీయంగా ఆలోచించాల్సిందే.


## ఇండియా కూటమికి బీటలు.. స్వరం మార్చిన మిత్రపక్షాలు



న్యూఢిల్లీ,హర్యానా సర్వేలన్నీ కాంగ్రెస్‌కే గెలుపు అవకాశాలు అని రిపోర్టులు ఇవ్వడంతో ఆ పార్టీ ఎక్కడలేని ఆశలు పెట్టుకుంది. ఫలితాల రోజు కూడా మొదట్లో ట్రెండింగ్ కాంగ్రెస్‌కు అనుకూలంగానే కొనసాగాయి. దాంతో కాంగ్రెస్ శ్రేణులంతా సంబరాల్లో మునిగాపోయారు. రౌండ్‌లు పెరుగుతున్న కొలదీ ఫలితాలు రివర్స్ అయ్యాయి. కంప్లీటుగా బీజేపీకి అనుకూలంగా వచ్చాయి. ఇక.. ఈ ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా ఖంగుతింది. ఫైనల్లీ హర్యానాలో అధికారం చేపట్టలేకపోయింది. బీజేపీనే హ్యాట్రిక్ విజయం సాధించింది.ముందు నుంచి హర్యానాలో తామే గెలుస్తున్నామని నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ఫలితాలు చేదు మిగిల్చడంతో ఆ పార్టీ నేతలు ఏవేవో ఆరోపణలు కూడా చేశారు. ఫలితాలను సరిగా లెక్కించలేదని, ఈవీఎంలలో లోపాలు ఉన్నాయంటూ ఆరోపించారు. కానీ.. వాటిని ఎన్నికల సంఘం ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని తేల్చిచెప్పింది. ఇప్పటికే హర్యానా ఫలితాలతో సతమతం అవుతున్న కాంగ్రెస్ పార్టీకి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మరో భారీ షాక్ తగిలింది. ఈ సారి మిత్రపక్షాల నుంచి ఆ సెగను ఎదుర్కోవాల్సి వచ్చింది.ఒక్కో ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీపై విమర్శలు చేయడం ప్రారంభించాయి. ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ అవకాశవాద ధోరణితో వ్యవహరిస్తున్నదని ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు ఆరోపిస్తున్నాయి. హర్యానాలో గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నా మిత్రపక్షమైన ఆప్‌ను కాంగ్రెస్ దూరం పెట్టిందని, అదే జమ్మూకశ్మీర్‌లో బలం లేదని ప్రాంతీయ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్‌తో చేతులు కలిపిందని విమర్శలున్నాయి. హర్యానాలో ఆప్‌తో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ బరిలోకి దిగి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవని చెబుతున్నారు. అవకాశవాదంతోనే ఒంటరిగా బరిలోకి దిగి బొక్కాబోర్లా పడిందని మండిపడుతున్నాయి.ఇదిలా ఉంటే.. ఆప్ కూడా కాంగ్రెస్‌కు కటీఫ్ చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆప్‌తోపాటు సమాజ్‌వాదీ పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీకి దూరం కానున్నట్లుగా తెలుస్తోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఇప్పటికే ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. మరోవైపు.. యూపీ బైపోల్స్ కోసం సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా అక్కడ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పార్టీ ముందస్తుగానే అనౌన్స్ చేసింది. అయితే ఈ ప్రకటన వెనుక కాంగ్రెస్ పార్టీపై సమాజ్‌వాదీ పార్టీకి ఉన్న ఆగ్రహమేనని అర్థం అవుతోంది.హర్యానా ఎన్నికలకు ముందు కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తు కోసం చర్చలు కొనసాగాయి. సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ కాస్త పట్టుదలగా వ్యవహరించింది. దాంతో ఇరు పార్టీల మధ్య పొత్తు కుదరలేదు. హర్యానాలో పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉండడంతో ప్రభుత్వ వ్యతిరేకత, సాగు చట్టాలపై రైతుల ఆందోళన, రెజ్లర్ల ధర్నాలు, అగ్నివీర్‌పై నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో అవి బీజేపీని ఓడిస్తాయని కాంగ్రెస్ గట్టి నమ్మింది. దాంతో ఆప్‌తో సీట్ల సర్దుబాటుకు వెనుకడుగు వేసిందని ఆ పార్టీ నేతలు చెప్పారు.ఇక మహారాష్ట్రలో ఈ ఏడాది చివరలో లేదంటే వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటివరకు మహారాష్ట్రంలోని శివసేన (యూబీటీ) కూడా ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. కానీ.. మొదటి సారి ఆ పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడింది. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గ కుమ్ములాటల వల్లనే ఎన్నికల్లో ఓడిపోవాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అలాగే జరిగిందని, ఇప్పుడు హర్యానాలోనూ కుమ్ములాటల వల్లే ఓడిపోవాల్సి వచ్చిందని ఆరోపించింది. ఓవర్ కాన్ఫిడెన్స్, అహంకారం వల్లే కాంగ్రెస్ ఓడిపోయినట్లు శివసేన తన అధికారిక పత్రిక సామ్నాలో పేర్కొంది.అటు.. తృణమూల్ కూడా కాంగ్రెస్ పార్టీపై ఫైర్ అయింది. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలను తన అవసరాలకు మాత్రమే వాడుకుంటున్నదని, ఈ విషయాన్ని ప్రాంతీయ పార్టీలు గుర్తించాలని టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే ట్వీట్ చేయడం సంచలనానికి దారితీసింది. తాము గెలుస్తామని అనిపిస్తే మరో పార్టీకి అవకాశం ఇవ్వం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వైఖరి ఉందని పేర్కొన్నారు. ఆ చిన్నచూపే కాంగ్రెస్ పార్టీని ఓడించిందని చెప్పుకొచ్చారు.

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది.వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది



నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లూ ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.


## సంపాదకీయం

**శుక్రవారం 11-10-2024**

# నెత్తురోడిన బస్తర్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతం మరోసారి మావోయిస్టు, పోలీసు బలగాల రణరంగమైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది మహిళా నక్సలైట్లు ఉన్నారు. భారీ మొత్తంలో రివార్డులున్న పలువురు సీనియర్లను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటైన 24 సంవత్సరాల కాలంలో ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్. వరుస నష్టాలతో కునారిల్లుతున్న మావోయిస్టులకు తాజా ఎన్‌కౌంటర్ పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఐదు మాసాల క్రితం కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మరణించారు. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 188 మంది నక్సల్స్ హతులయ్యారు. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎదురుకాల్పుల మృతుల సంఖ్య 237కు చేరుకుంది. శుక్రవారం నాటి ఎదురు కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. మారుమూల అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు పూర్తి సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించడం వల్లే ఇది సాధ్యమైందన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. కానీ, హింస ఎటువైపు నుంచి జరిగినా ప్రాణ నష్టం తప్ప సాధించేదేమీ ఉండదు. సుమారు ఆరు దశాబ్దాల కిందట సమ సమాజం, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అనే భావనలతో మొదలైన నక్సలైట్ ఉద్యమం కాలక్రమంలో అనేక చీలికలకు గురైంది. ప్రస్తుతం నక్సల్ ఉద్యమం కొన్ని ప్రాంతాలకే, ముఖ్యంగా గిరిజనులు అధిక సంఖ్యలో ఉండే అటవీ ప్రాంతాలకే పరిమితమైంది. గిరిజనులకు వారసత్వంగా సంక్రమించిన అటవీ సంపదను కార్పొరేట్‌శక్తుల బారి నుంచి కాపాడే ప్రయత్నాలకు నక్సలైట్లు మొదటినుంచీ అండగా నిలుస్తున్నారు. అయితే అందుకు వారు సాయుధ మార్గాన్ని ఎంచుకోవడం సమస్య అయింది. నక్సల్ ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూసే ప్రభుత్వం పోలీసు బలంతో అణచడం వైపే ఎక్కువగా మొగ్గుచూపడం తెలిసిందే. అందునా కమ్యూనికేషన్స్, నిఘా సాంకేతికత ఎంతగానో విస్తరించిన ప్రస్తుత కాలంలో పోలీసు వ్యవస్థకు ఉండే ఆధిక్యతను తక్కువగా అంచనా వేయలేం. ప్రపంచవ్యాప్తంగా సాయుధ పోరాటాలు విఫలమయ్యాయనేది ఎంత సత్యమో, కేవలం ఆయుధ బలంతో ఉద్యమాలను అణచివేయలేమనేదీ అంతే సత్యం. ఈ నేపథ్యంలో జరిగిన బస్తర్ ఎన్‌కౌంటర్ అటు ప్రభుత్వ వ్యవస్థ, ఇటు మావోయిస్టులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అగత్యాన్ని నొక్కి చెప్తున్నది. పోలీసుల్లోనూ, నక్సల్స్‌లోనూ అధికంగా బలయ్యేది అట్టడుగు, నిరుపేద వర్గాల యువతే. ఈ దేశ సంపదలో భాగమైన యువత ఇలా హింసాత్మక ఘటనలకు బలైపోవడం బాధాకరమైన విషయం. నక్సల్స్‌కు నెలవులుగా మిగిలిపోయిన గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తే సమస్యకు పరిష్కారం కనుగొనడం సాధ్యమే. అదేవిధంగా నక్సల్స్ కూడా కాలం చెల్లిపోయిన సాయుధ పోరాట వ్యూహాలను వదిలిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాల్సిన అవసరమూ ఉన్నది. ఇప్పటివరకు జరిగిన నష్టం చాలు. ఇకనైనా ఇరుపక్షాలూ పట్టు విడుపులు ప్రదర్శించి ఏకాభిప్రాయానికి వస్తే దేశానికి అంతకన్నా కావాల్సింది ఏముంటుంది.

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం



ముంబై,అక్టోబర్9:విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం ప్రకటించారు. రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది పదోసారి. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. రెండో త్రైమాసికంలో 7 శాతం, మూడు, నాలుగో త్రైమాసికంలో 7.4శాతంగా ఉండే అవకాశం. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో 7.3శాతంగా వృద్ధి రేటు అంచనా వేసింది. మెరుగైన వర్షపాతం నమోదు, సరిపడా నిల్వలతో ఈ ఏడాది చివరికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉంది. సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరగొచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉండే అవకాశం ఉంది. తయారీ ఖర్చులు తగ్గడం, ప్రభుత్వ విధానాలు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్ తదితర కారణాలతో తయారీ రంగం వృద్ధి చెందుతోంది. ఆర్థిక రంగం స్థిరంగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. యూపీఐ లైట్ వాలెట్ పరిమితి రూ.2000 నుంచి రూ.5వేలకు పెంపు దేశంలోని సామాన్య ప్రజలకు ఈసారి కూడా ఉపశమనం లేదు. ఇఓఎల పెనుభారం తగ్గలేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , తన పాలసీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. యథాతథంగా, 6.50 శాతం వద్ద కొనసాగించింది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ తన రెపో రేటును అలాగే కొనసాగిస్తూ వస్తోంది. రెపో రేట్‌లో ఎలాంటి మార్పు చేయకుండా, యథతథంగా కొనసాగించడం వరుసగా ఇది పదో సారి. 2024లో ఇది వరుసగా ఐదోసారి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు రెపో రేటు తగ్గింపును వ్యతిరేకించారు. దేశంలో రెపో రేటును తగ్గించకూడదంటూ ఐదుగురు సభ్యులు ఓటు వేసినట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం, 4 శాతం కంటే తక్కువగానే ఉన్నప్పటికీ, రెపో రేటులో కేంద్ర బ్యాంక్ ఎటువంటి మార్పు చేయలేదు. రెపో రేట్‌లో మార్పు ఉండదని మార్కెట్ ముందు నుంచీ ఊహిస్తోంది కాబట్టి, ఇదేమీ ఆశ్చర్యకరమైన నిర్ణయం కాదు. ౯÷పో రేట్ మారదని ముందు నుంచి సిద్ధమైన మార్కెట్, ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంపై మాత్రం నిశితంగా దృష్టి పెట్టింది. భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన ఏం చెబుతారన్నది ఇటు సామాన్య ప్రజలకు, అటు కార్పొరేట్లకు చాలా కీలకం. దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశర చేసే వ్యాఖ్యలు గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి కాబట్టి, ఆయన మాటలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ద్రవ్యోల్బణానికి ప్రపంచ ఉద్రిక్తతలు అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని అన్నారు. లోహాలు, ఆహార పదార్థాల ధరల్లో ఇటీవలి పెరుగుదల కారణంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రమాదంలో ఉంది. 2024 జులై, ఆగస్టు నెలల్లో ప్రధాన ద్రవ్యోల్బణం పెరిగిందని, బేస్ ఎఫెక్ట్ కారణంగా చిల్లర ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చిల్లర ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) ద్రవ్యోల్బణం 4.1 శాతంగా, మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) 4.8 శాతం, నాలుగో త్రైమాసికంలో (జనవరి-మార్చి) 4.2 శాతం ఉండొచ్చని చెప్పారు. దేశంలో ద్రవ్యోల్బణం రేటును అదుపులో ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇన్‌ఫ్లేషన్ అదుపులో ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఆహార ద్రవ్యోల్బణం మాత్రం ఇప్పటికీ లక్ష్యానికి మించి ఉంది. అంటే, దేశంలో ఆహార పదార్థాల ధరలు అదుపులో లేవు. అందుకే, రెపో రేటును 6.50 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ నిర్ణయించింది. రెపో రేట్ తగ్గితే, బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయి. రెపో రేట్ తగ్గించక పోవడంతో, కోట్లాది మంది రుణగ్రహీతలు, బ్యాంకు ఖాతాదార్లు నిరాశకు గురయ్యారు. వడ్డీ రేట్లు తగ్గితే లోన్ తీసుకుందామని ఎదురు చూస్తున్నవారికి కూడా ఇది నిరాశ కలిగించేదిగా ఉంది. పండుగ సందర్భంగా ఆర్‌బీఐ నుంచి మంచి నిర్ణయం వినొచ్చని ఎదురు చూస్తున్న ప్రజలంతా నిరుత్సాహపడ్డారు.

### సిఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో మాజీమంత్రి మల్లారెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి వచ్చి. తన మనమరాలి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించారు. పెళ్లి పత్రిక ఇచ్చేందుకు రేవంత్ ఇంటికి వచ్చానని స్పష్టం చేశారు.

# పెరుగుతున్న వ్యవసాయ కూలీలు తగ్గుతున్న గ్రామీణ ఉపాధి!

న్యూఢిల్లీ,నేటికీ వ్యవసాయ రంగం దేశానికి కీలకంగా ఉంది. సేద్యపు పనుల్లో, పంటల ఉత్పత్తిలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతాంగం ముఖ్య భూమిక వహిస్తున్నారు. వీరు పొలంలో కష్టపడితేనే సేద్యం ముందుకు సాగుతుంది. ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. వ్యవసాయ రంగానికి ఇంత కీలకమైన వ్యవసాయ కూలీల, చిన్న రైతుల పరిస్థితులు మాత్రం దుర్భరంగా మారాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భూమి లేని వ్యవసాయ కూలీల సంఖ్య 14 కోట్లుగా ఉంది. ఇప్పుడు ఈ వీరి సంఖ్య బాగా పెరిగింది.గ్రామీణ ప్రాంతాల్లో 35.5 కోట్ల మంది కూలీలు ఉండగా, వారిలో 61.5% మంది వ్యవసాయ రంగంలో, 20% పారిశ్రామిక రంగంలో పని చేస్తున్నారు. మిగతా కూలీలు వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. దేశంలో వ్యవసాయ కూలీల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణం పాలకు ప్రభుత్వాలే. పాలకుల విధానాల మూలంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతాంగం అప్పుల పాలై ఉన్న కొద్ది పాటి భూమిని అమ్ముకుని ఇతరుల పొలాల్లో కూలీలుగా పని చేస్తున్నారు.

వ్యవసాయ రంగంలో మహిళలు

దేశ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజల్లో 72% మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం దేశంలోని 84% మంది మహిళలు జీవనాధారం కోసం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. అందులో 33% రైతులు కాగా, 47% మంది రైతు కూలీలు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని మొత్తం మహిళా కార్మికుల్లో 55% మహిళలు కూలీలుగా ఉన్నారు. 24% మంది సాగు చేసే రైతులుగా ఉన్నారు. ఇప్పుడు దేశంలో మహిళా కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగి ఉంటుంది. 2011 తర్వాత జనాభా లెక్కలు జరగక పోవటంతో వివరాలు అందుబాటు లేవు.వ్యవసాయ పనులు సీజనల్ వారీగా జరుగుతాయి. నాట్లు, కోతలు, కుప్పలు వేయటం, నూర్చటం, రబీలో వరి నాట్లతో పాటు మొక్కజొన్న, జొన్న తదితర పంటల విత్తనాలు వేయటం, ఆ పంటలు కోయటం సీజన్ పనులుగా ఉన్నాయి. ఈ పంటలతో పాటు మిర్చి, పత్తి, వేరుశనగ పంటలు కూడా సాగు చేస్తున్నారు. 1990 వరకు సంవత్సరంలో వ్యవసాయ పనులు 120 రోజుల వరకు ఉండేవి. క్రమంగా కూలీల సంఖ్య పెరగటం, ప్రాంతాలను బట్టి పనులు ప్రారంభం కావటం, ముందుగా పనులు ప్రారంభమైన ప్రాంతాలకు మిగతా ప్రాంతాల పేదలు పనులకు వెళ్లటంతో కూలీల సంఖ్య పెరిగి త్వరగా పనులు కావటమే కాకుండా, పని దినాలు తగ్గుతూ వచ్చాయి. ఆ తర్వాత కాంట్రాక్ట్ పని, అవసరానికి మించి సేద్యంలో యంత్రాల వినియోగంతో లభించే ఉపాధిలో సగం పని దినాలు కూలీలు కోల్పోయారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో యంత్రాలే 80 శాతం పైగా పనులు పూర్తి చేస్తున్నాయి. వ్యవసాయ కూలీలకు నామ మాత్రపు పనులే లభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో సీజన్‌లో 15 లేక 20 మించి పనులు లభించటం లేదు. సీజన్ -సీజన్ మధ్య ఏర్పడే విరామ సమయంలో ఎటువంటి పనులు ఉండవు.భారత దేశంలో వేళ్ల మీద లెక్కించబడిన వారి సంపద వేల కోట్లు పెరుగుతుంటే, పంటల ఉత్పత్తికి కారకులైన వ్యవసాయ కూలీల, కూలీ రేట్లు ఏడాదిలో 15 రూపాయల పెరుగుదల మాత్రమే ఉందని కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో చెప్పింది. 2017 నుంచి వ్యవసాయ కూలీల ఆదాయం ఎంత పెరిగిందనే దానిపై లేబర్ బ్యూరో గణాంకాలను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా బయటపెట్టింది. వ్యవసాయ రంగంలో ఉపాధి క్షీణించటం వలన పురుష కూలీలు, పేద రైతులు ఉపాధి కోసం పట్టణాలకు వలసలు పోవటంతో వ్యవసాయ రంగంలో సాగుదారులుగా, కూలీలుగా మహిళలు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. 2017 వ్యవసాయ కూలీల దినసరి సగటు కూలి 266 రూపాయలుగా ఉండగా, 2022 ఆగస్టులో 342 పెరిగింది. ఈ కాలంలో ధరల సూచిక 899 పాయింట్ల నుంచి 1152 పాయింట్లకు పెరిగింది.మహిళా కూలీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వీరి దినసరి



కూలి 271 రూపాయలు మాత్రమే. కూలీ రేట్లు పెరిగినట్లు పైకి మాత్రమే కన్పిస్తుంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే వాస్తవ దినసరి వేతనం పురుషులకు 207, మహిళలకు 160 రూపాయలకు తగ్గింది. కూలీ రేట్ల నిర్ణయంలోనూ కుల వివక్ష కొనసాగుతూనే ఉందని లేబర్ బ్యూరో నివేదికలో బయటపడింది. 2022 ఆగస్టులో తీసిన లెక్కల ప్రకారం ఎస్‌సిల పురుష కూలీల రోజు వారీ సగటు కూలి 290 రూపాయలు, మహిళల కూలి 269 రూపాయలుగా ఉంది. ద్రవ్యోల్బణం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కోణంలో చూస్తే వీరి కూలీ రేట్లు తక్కువగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కూడా గ్రామీణ పేదల ఉపాధి సమస్యను పరిష్కరించలేకపోయింది. వంద దినాల పని కల్పించటంలో మోడీ ప్రభుత్వం వైఫల్యం చెందింది. జాబ్ కార్డు పొందిన వారిలో 33% మించి పనులు లభించలేదు.ఈ పథకంలో సాంకేతిక పద్ధతి అమలు చేస్తున్న ఫలితంగా పరిస్థితి గందరగోళంగా మారింది. మొబైల్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు, కూలీల డబ్బుల చెల్లింపుల్లో జాప్యం లాంటి సమస్యలతో విసిగిపోయి చాలా మంది ఉపాధి పనులు మానుకుని వేరే పనులకు చేసుకుంటున్నారు. లభించే కూలీ కూడా చాలా తక్కువగా ఉంది. 2022లో లభించిన రోజు కూలి 209 రూపాయలు కాగా, 2023లో 218 రూపాయలుగా ఉంది. పెరిగిన ద్రవ్యోల్బణం ప్రకారం లెక్కలు వేస్తే లభించే కూలి 122 రూపాయలు మాత్రమే. ఇది వ్యవసాయ పనులకు లభించే కూలి కన్నా 100 రూపాయలు తక్కువ. ఈ కూలీ కూడా అనేక రాష్ట్రాల్లో లభించడం లేదు. పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తక్కువ కూలైనా లక్షలాది గ్రామీణ పేదలు పని చేస్తున్నారు. దీన్ని గమనిస్తే ఉపాధి సమస్య తీవ్రత తెలుస్తుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల అతి తక్కువ ఆదాయం పొందుతూ దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. ఆర్థిక సర్వే ప్రకారం, అనారోగ్య పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే వారికి లభించే ఆదాయం చాలక అప్పుల పాలు చేస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్ ఆధ్వర్యంలోని జాతీయ గణాంకాల కార్యాలయం గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం 50 శాతం పైగా వ్యవసాయ కూలీ కుటుంబాలు అప్పుల్లో ఉన్నారని తేలింది. గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల పేదరికానికి, వారి కుటుంబాలు దుర్భర పరిస్థితులకు సేద్యపు భూమికి విడదీయరాని సంబంధం ఉంది. భూమి గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉత్పత్తి సాధనం.అధికార మార్పిడి జరిగి దశాబ్దాలు గడుస్తున్నా పంట ఉత్పత్తులకు మూల కారణమైన పేదలకు సేద్యపు భూమి దక్కలేదు. అర్ధభూస్వామ్య వ్యవస్థకు ప్రాతినిధ్య వహించిన, వహిస్తున్న పాలక ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు పేదలకు భూమి పంచకపోగా, భూస్వామ్య వర్గాన్ని మరింత పటిష్ట పరిచింది. దేశం పారిశ్రామికంగా అభివృద్ధి కావాలన్నా, ఉపాధి లభించి పేదలు, పేదరికం నుంచి బయట పడాలన్నా విప్లవ భూ సంస్కరణల ద్వారా పేదలకు భూ పంపిణీ జరగాలి. భూస్వామ్య, బడా పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలేవి అలాం టి భూసంస్కరణలు అమలు జరపవు. ప్రజలే పోరాడి సాధించుకోవాలి.

# బాసర సరస్వతీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

నిర్మల్,బాసర సరస్వతీ దేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూల నక్షత్ర పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మ నక్షత్రం కావడంతో భక్తులు భారీగా తరలి వస్తున్నారు. తెల్లవారు జాము రెండు గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మండపాలు కిట కిట లాడుతున్నాయి. అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలోని ఏకైక చదువుల తల్లి కొలువైన బాసర క్షేత్రంలో మూల నక్షత్రం పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చరేయిస్తున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్ధరాత్రి మూల నక్షత్రం వస్తుందని, రెండు గంటల నుంచి ఆలయంలో అక్షరాభ్యాస పూజలను ప్రారంభించారు. తెల్లవారు జాము ఐదు గంటల నుంచి అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాగా దేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవీ అమ్మవారి ఆలయం ఒకటి. అమ్మవారి సన్నిధిలో సాధారణంగా అక్షరాభ్యాసం టికెట్ 150 రూపాయలు, రూ.1000లుగా నిర్ణయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్షరాభ్యాస పూజలకు, సర్వదర్శననికి వేరు వేరుగా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆన్‌లైన్ టికెట్ల ప్రత్యేక అక్షరాభ్యాస క్యూలైన్లు, రూ.100, ప్రత్యేక దర్శనానికి క్యూ లైన్ ఆలయ అతిథి గృహాల వద్ద నుండి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా మూల నక్షత్ర పర్వదిన వేడుకలు సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. అక్షరాభ్యాస పూజలు సర్వదర్శనాల క్యూ లైన్‌లో భక్తులకు పాలు, నీరు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రెండు బయో టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే గోదావరి నది తీరాన అందుబాటులో 40 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. వాహనాలకు మూడు చోట్ల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# పవన్ స్వామీ..ప్రజలకోసం పనిచేయండి

చిత్తూరు,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి ఆర్కే రోజా విరుచుకుపడ్డారు. పవన్ స్వామి.. మీరు పంచె ఎగ్గట్టాల్సింది గుడిమెట్లపై కాదు.. విజయవాడ వరద బాధితుల కోసం అని తెలిపారు. ధర్మం ధర్మం అని అరవాల్సింది నడి రోడ్డుపై కాదు.. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ కార్మికుల కోసం అని పేర్కొన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా పవన్ కల్యాణ్‌పై ఘాటుగా స్పందించారు. అలాగే ఏ పనిచేస్తే బాగుంటుందో సలహాలు కూడా ఇచ్చారు. పవన్ కళ్యాణ్ అనబడే ఉప ముఖ్యమంత్రి గారూ.. మీరు గొడవపడాల్సింది.. మతాల కోసం కాదు.. నీట మునిగి సాయమందని పేదల కోసం! మీరు కడగాల్సింది మెట్లను కాదు..ఇసుక లేకుండా చేస్తున్న మీ నాయకుల అవినీతిని..! మీరు దీక్ష చేయాల్సింది.. ప్రసాదాల కోసం కాదు.. రాష్ట్రం లో రాలి పోతున్న ఎంతో మంది చిన్న పిల్లల మాన ప్రాణాల కోసం! మీరు ఉపవాసం ఉండాల్సింది.. దేవుళ్ల కోసమే కాదు.. ఎక్కడ చూసినా.. ఆహారం కలుషితమై.. ఆసుపత్రి పాలౌతున్న.. విద్యార్థుల కోసం! అని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు.మీరు బొట్లు పెట్టాల్సింది.. గుడి మెట్లకు కాదు.. నాడు నేడు పథకాన్ని కొనసాగించి బాగుపరిచిన బడి మెట్లకు! మీరు డిక్లరేషన్ ప్రకటించాల్సింది.. ఇప్పుడు ఏ లోటు లేని సనాతనం కోసం కాదు.. మిమ్మల్ని నమ్మి ఓట్లేసిన జనాల కోసం! మీరు ఆపసోపాలు పడాల్సింది.. కొండెక్కడం కోసం కాదు..రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలు అరికట్టడం కోసం! మీరు సంప్రోక్షణ చేయాల్సింది కల్తీ జరిగిందో లేదో తెలియని .. లడ్డూ కోసం కాదు ప్రజలకు ఇసుకే దొరకకుండా చేసిన.. కూటమి నాయకయుల అవినీతి ప్రక్షాళన కోసం! అని రోజా వ్యాఖ్యానించారు. మీరు దృష్టి పెట్టాల్సింది పక్క రాష్ట్రాల నాయకుల మాటపై కాదు? మీ నియోజకవర్గంలో వికృత చేష్టలకు పాల్పడుతున్న మీ నాయకులపైన అని పవన్ కల్యాణ్‌కు రోజా సూచించారు. దేవుడు తమరికి పుట్టుకతో బుద్ధి జ్ఞానం ఇచ్చి ఉంటే దాన్ని కాస్త ఉపయోగించండి పవన్ స్వామి అని అన్నారు.

# బీజేపీ చేతిలోనే ?

జమ్ము కశ్మీర్: దేశంలో రెండు రాష్ట్రాల ఫలితాలు ప్రజలందరికీ ఉత్కంఠ కలిగించాయి. దేశాన్ని ఏలే బీజేపీ ఈ రెండు రాష్ట్రాలలో ఎలా తన రాజకీయ ప్రదర్శన చేస్తుంది అన్నది అందరిలోనూ ఆసక్తి బాగా పెరిగిపోయింది. దానికి కారణం కాశ్మీర్ లో 370 ఆర్టికల్ ని రద్దు చేసిన తరువాత తొలిసారి జరిగిన ఎన్నికలు.అంతే కాదు దేశంలోని మిగిలిన రాష్ట్రాలలో కంటే ఎక్కువగా కాశ్మీర్ అభివృద్ధి కోసం గత అయిదేళ్లలో కేంద్రం స్పెషల్ గ్రాంట్స్ ని సైతం వెచ్చించి ఖర్చు చేసింది. అక్కడ అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తోంది. దానికి ప్రజలు అంగీకరిస్తున్నారు కూడా.అయితే కాశ్మీర్ లోయలో మాత్రం బీజేపీకి ఒక్క సీటు దక్కలేదు. జమ్మూలోనే ఉన్న 43 సీట్లలోనే బీజేపీ గెలుచుకుంటూ వస్తోంది. అలా 29 దాకా సీట్లతో అతి పెద్ద పార్టీగా ఉంది. ఇక కాశ్మీర్ లో మొత్తం సీట్లు 90 అయితే మరో అయిదురుగుని లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేస్తారు. వారంతా బీజేపీకి చెందిన వారే ఉంటారు అనడంతో సందేహం లేదు. అలా బీజేపీ ఈసారి బలమైన ప్రతిపక్ష పాత్రను కాశ్మీర్ లో పోషించబోతోంది.ఇక నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమి మ్యాజిక్ ఫిగర్ ని సాధించి అధికారం అందుకోవడానికి సిద్ధంగా ఉంది. అయితే కాశ్మీర్ జమ్మూ ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా కేంద్రం ఉంచింది. దాంతో కాశ్మీర్ లో పరిస్థితి కూడా అచ్చం ఢిల్లీ మాదిరిగానే ఉంటుంది. ఇంకా ఎక్కువగానే ఉంటుంది అని చెప్పాలి.లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం తన పరోక్ష అధికారాలను చలాయించే అవకాశాలు కూడా ఉన్నాయి అని అంటున్నారు. 2019లో జమ్మూ కాశ్మీర్ లో రాష్ట్ర హోదా రద్దు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా చేసి కేంద్రం చట్టం చేసింది. దాంతో ఇపుడు బీజేపీకి ఇది అడ్వాంటేజ్ గా మారబోతోంది. అక్కడ ప్రజలు నెగ్గించిన ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. కానీ అదే సమయంలో అపరిమితమైన అధికారాలు ఏవీ ఉండవు.లెఫ్టినెంట్ గవర్నర్ కేంద్ర పాలిత ప్రాంతాలలో కీలకంగా ఉంటారు అన్నది తెలిసిందే. నిజానికి బీజేపీ కనుక కాశ్మీర్ లో అధికారం అందుకుంటే రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని అనుకుంది. కానీ ఫలితాలు తేడా కొట్టడంతో బీజేపీ ఆ ఆలోచనలు చేయదని అంటున్నారు.దాంతో కాశ్మీర్ లో కూటమి ప్రభుత్వం పరిమితమైన అధికారాలలో పాలన చేయాల్సి ఉంటుంది అని అంటున్నారు.

# సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

విజయవాడ, ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఏడవరోజు బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. దీంతో అధికారులు అన్ని టిక్కెట్లు రద్దు చేసి, అన్ని క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే దేశ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రం కావడంతో దుర్గమ్మ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో దుర్గమ్మను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. కుమార్తె ఆద్యతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న పవన్‌కు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటం అందజేశారు. పవన్‌తోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి నిమ్మల రామానాయుడు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇక ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తాన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత వచ్చారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను చూడగానే భక్తులలో ఒక్కసారిగా ఉత్సాహం వచ్చింది. జై జనసేన జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. వినాయకుని గుడి వద్ద క్యూలైన్లు దాటి భక్తులు బారులు తీరారు. బాక్సుల విధానంలో రోప్‌ల సాయంతో యాభై మంది చొప్పున భక్తులను క్యూలైన్‌లోకి పోలీసులు పంపుతున్నారు. తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టి లో ఉంచుకుని సీపీ రాజశేఖర్ బాబు ముందస్తుగా అవసరమైన అన్నీ చర్యలు చేపట్టారు. కొండపైకి ఈరోజు ఎటువంటి వాహనాలను అనుమతించమని పోలీసులు వెల్లడించారు. కాగా బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి మూడు గంటలకు ఇంద్రకీలాద్రికి చేరుకోనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని సీపీ తెలిపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమయాను కూలంగా ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. కనకదుర్గా పై ఓల్గ÷వర్ మీద ఎటువంటి ఆంక్షలు లేవని, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ÷÷-ల ఓవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించామన్నారు. ఇప్పటికే విధులలో 4,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా, అదనంగా మరో 1100 మంది పోలీసులను 110 బృందాలుగా ఏర్పాటు చేసి హోల్డింగ్ టీమ్‌లుగా విధులు కేటాయించినట్టు తెలిపారు. కాగా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనకదుర్గమ్మ అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాత అయిన లక్ష్మీదేవిగా దర్శనమివ్వగా అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఒంటినిండా బంగారం, పుష్పాలంకరణలో ఐశ్వర్య ప్రదాయిని రూపాన్ని తిలకించి తరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ రాష్ట్రాలనుంచి తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు నిండిపోయాయి. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శివస్వామి దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల నుంచి పట్టుచీర సమర్పించారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం సాధారణంగానే కనిపించింది. మామూలు రోజుల్లో ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తులు అధికంగా వస్తుంటారు. ఈ రోజుల్లో 50 వేల నుంచి 60 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటుంది. ఆ స్థాయిలోనే భక్తులు వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ రూ.500 క్యూలో వచ్చి రాజగోపురం వద్ద సొమ్ముసిల్లి పడిపోయింది. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారి సందడి ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి కాణిపాకం దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనధికార దర్శనాలు పెరిగిపోవడంతో పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. వీఐపీలకు కేటాయించిన 9-11, 2-4 స్లాట్‌ల్లో కాకుండా ఇతర సమయాల్లో వస్తే వారిని వీఐపీ మార్గంలో దర్శనాలకు అనుమతించడంలేదు. వారిని రూ.500 క్యూలో పంపుతున్నారు. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పవర్ మిస్

హర్యానా:ఎన్నికల వేళ ప్రతి ఓటు విలువైనదే. చిన్న తేడాలు సైతం అధికారాన్ని చేజారేలా చేస్తుంటాయి. తాజాగా హర్యానా ఎన్నికల ఫలితం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది. మంగళవారం వెలువడిన ఓటర్ల తీర్పు ఎగ్జిట్ అంచనాలకు భిన్నంగా ఉండటంతో పాటు.. బీజేపీకి భారీ ఊరటను ఇచ్చిందని చెప్పాలి. ముచ్చటగా మూడోసారి హర్యానా రాష్ట్రంలో కాషాయ జెండా రెపరెపలాడింది. ఆసక్తికకరమైన విషయం ఏమంటే.. ఈ ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని.. అధికారాన్ని సొంతం చేసుకుంటుందని ఎగ్జిట్ అంచనాలకు భిన్నంగా ఎన్నికల పలితాలు వెలువడ్డాయి.90 స్థానాలున్న హర్యానా అసెంబ్లీలో చిన్న పాటి ఓట్ల శాతం తేడా.. కాంగ్రెస్ చేతికి అధికారం రానివ్వలేదు. ఓట్ల లెక్కింపు వేళ.. పోటాపోటీగా.. ఒక దశలో ఎవరు అధికారాన్ని సొంతం చేసుకుంటారన్న టెన్షన్ తెప్పించిన హర్యానా ఫలితం చివరకు బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే.. చిన్నపాటి వ్యత్యాసం కాంగ్రెస్ చేతికి నుంచి బీజేపీ గూటికి అధికారం వెళ్లేలా చేసిందని చెప్పాలి.మొత్తం పోలైన ఓట్లలో బీజేపీకి 39.94 శాతం ఓట్లను సొంతం చేసుకోగా.. కాంగ్రెస్ 39.09 శాతం దగ్గర ఆగిపోయింది. అంటే.. 0.9 ఓట్ల తేడా కాంగ్రెస్ చేతికి అధికారం లేకుండా చేసింది. మరింత కచ్చితంగా చెప్పాలంటే 8 శాతం ఓట్ల వ్యత్యాసం కాంగ్రెస్ అధికార కలల్ని కల్లలు చేసింది. 39.94 శాతంతో బీజేపీ 48 స్థానాల్లో విజయం సాధిస్తే.. 39.09 శాతం ఓట్లతో కాంగ్రెస్ 37 స్థానాల వద్ద ఆగింది. 4.14 శాతం ఓట్లతో ఐఎన్ఎల్ డీ (ఇండియన్

# ఓడిపోతే ఇవిఎంలది తప్పా ?



న్యూఢిల్లీ,హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించగా కాశ్మీర్‌లో ఇండియా కూటమి గెలిచింది. ఎన్‌సితో పొత్తు ద్వారా కాశ్మీర్‌లో కాంగ్రెస్ కొన్ని సీట్లు సాధించుకో గలిగింది. ఇక హర్యానాలో గెలుస్తారని సర్వేలు చెప్పినా..అనూహ్యంగా బిజెపి పుంజుకుని విజయం సాధించింది.ఇంతవరకు బాగానే ఉన్నా..మరోమారు కాంగ్రెస్ తన అనుమానాలను బయటపెట్టింది. ఇవిఎంల ట్యాంపరింగ్ అంటూ పాత పాట పాడింది. కాశ్మీర్‌లో కూడా ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి గెలిచేది. హర్యానాలో ట్యాంపర్ చేసిన బిజెపి,కాశ్మీర్‌ను మాత్రం వదులుకుంటుందా అన్నదే ప్రశ్న. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తే రెండు రాష్ట్రాలపై చేయాలి. వారు గెలిచిన కర్నాటక, తెలంగానల పైనా చేయాలి. కానీ గెలిచిన చోట వదిలి ఓడిన చోట ట్యాంపరింగ్ అంటే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. పదేళ్ల యూపిఎ పాలన అంతా ట్యాంపరింగ్ గెలుపుతో నడిచిందా అన్నది కూడా కాంగ్రెస్ చెప్పాలి. ట్యాంపరింగ్ అనుమానాలపై ఇప్పటికే నివృత్తి జరిగింది. ఇసి పలు సందర్భాల్లో వాటిని ఎలా వినియోగిస్తున్నదీ వివరించింది. టెక్నికల్ టీమ్ వాటిని సరిచూసింది. ఈ క్రమంలో ఇవిఎంలపై అనుమానాలను మాత్రం బిజెపి కొట్టి పారేస్తోంది. సాంకేతికత అభివృద్ది చెందిన తరుణంలో దీనిపై అనుమానాలు అక్కర్లేదు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తూ..తమను ప్రజలు తిరస్కరించారన్న నిజాన్ని కాంగ్రెస్ అంగీకరించడం లేదని అందరూ గుర్తుంచుకోవాలి. గతంలో అనేకమార్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఆనాడు అనుమానాలు వ్యక్తం చేయలేదు. తాజాగా ఇప్పుడు మారోమారు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇవిఎంలతోనే గతంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తున్నప్పుడల్లా ఓటమి చెందుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియాకూటమితో పోవడంతోనే ఈ మాత్రం సీట్లు సాధించగలిగింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారడంతో నెపాన్ని ఇవిఎంలపైకి నెట్టేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ ఇండియా పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. గత పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి తలపడ్డ అనేక సందర్భాల్లో ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది. హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94 శాతం ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09శాతం ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది. 2022లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. ఈ విజయాలను విశ్లేషించుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలి. ఇవిఎంలపై నెపాన్ని నెట్టేసి, అది మోడీ కుట్ర అంటూ సాగితే ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. హర్యానాలో ఓటమి గుణపాఠం కావాలి. మరింత పట్టుదలగా పనిచేయాలి. అధికారం ఉన్న రాష్ట్రాల్లో ఆదర్శ పాలన అందించాలి. ఢిల్లీ ప్రదక్షిణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. చీటికిమాటికీ మంత్రులు, ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకునే సంస్కృతి పోవాలి. కాంగ్రెస్ తన లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగితేనే ప్రజలు ఆదరిస్తారు.

## ఒడిదుడుకుల్లో అంతర్జాతీయ మార్కెట్లు

న్యూఢిల్లీ,అంతర్జాతీయ ప్రభావంతో బులియన్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. దీని ప్రభావంతో మొన్నటి వరకు భారీ స్థాయిలో ఒడిదుడుకులకు గురైన ప్రపంచంవ్యాప్తంగా ఎఫెక్ట్ పడుతోంది. మార్కెట్‌లు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న మార్కెట్ ఇప్పుడు కాస్త స్థిమితపడింది. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,654 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మన దేశంలో ఈ రోజు 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర 760 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ (22 క్యారెట్లు) ధర 700 రూపాయలు, 18 క్యారెట్లు రెట్ల బంగారం రేటు 570 రూపాయల చొప్పున తగ్గింది. వెండి రేటు 2000రూపాయలు తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 76,690 వద్దకు; 22 క్యారెట్ల బంగారం ధర 70,300 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 57,520 వద్దకు చేరింది.

# ఫలితాలను విశ్లేషిస్తున్నాం

న్యూఢిల్లీ,ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణా లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. హరియాణాలో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 90 సీట్లకు గానూ 48 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించి చివరకు భాజపా విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్నిచోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదవడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది. దీంతో ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంల పైనా ఆరోపణలు చేశారు. మరోవైపు జమ్మూకశ్మీర్ లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్‌సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్‌సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. భాజపా 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది.

# మౌనం అందుకేనా?!

హైదరాబాద్,రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతామంటూ హడావుడి చేస్తున్నది. ఈ ప్రాజెక్టును వివాదాస్పద చరిత్ర కలిగిన మెయిన్‌హార్ట్ కంపెనీకి కట్టబెట్టింది కూడా. కాంగ్రెస్ ప్రభుత్వ ఏకపక్ష వైఖరిని, మెయిన్‌హార్ట్‌కు మూసీ ప్రాజెక్టును కట్టబెట్టడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. బీజేపీ నేతలు మాత్రం ఈ అంశంపై ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడకపోవటం చర్చనీయాంశమవుతున్నది. మూసీ ప్రాజెక్టుపై, దాన్ని మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగించడంపై కమలనాథులు నోరుమెదపకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని నెటిజన్లు సోషల్‌మీడియాలో పలు కామెంట్లు పెడుతున్నారు.

ప్రధాని మోదీ ఏరికోరి..

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులనిచ్చేందుకు చైనాకు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ బ్యాం కు డైరెక్టర్ జనరల్ పాండ్యన్ గత ఫిబ్రవరి 1న సీఎం రేవంత్ రెడ్డికి హామీనిచ్చారు. పాండ్యన్ పూర్తిపేరు డీ జగదీశ పాండ్యన్. తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్. దాదాపు 13 ఏండ్లపాటు గుజరాత్‌కు సీఎంగా చేసిన నరేంద్రమోదీ 2014 మేలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆనందీబెన్‌ను గుజరాత్‌కు సీఎంగా ప్రకటించారు. అయితే, అప్పటికే తన ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్లలో కీలక పాత్ర పోషిస్తూ తన తో కలిసి పనిచేసిన పాండ్యన్‌పై ప్రధాని మోదీకి ఎంతో నమ్మకం. మంచి సాన్నిహిత్యం కూడా. ఈ క్రమంలోనే 2014 నవంబర్ 1న గుజరాత్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను పాండ్యన్‌కు అప్పగించారు. అనంతరం పాండ్యన్ వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్‌గా మారారు. మోదీ సన్నిహితుడిగా పేరున్న అదే పాండ్యన్.. మూసీ ప్రాజెక్టుకు నిధులను ఇస్తామంటూ హామీనివ్వడంతోనే బీజేపీ నేతలు ఈ అంశంపై ఏమీ మాట్లాడటం లేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

బాబుతోనూ సాన్నిహిత్యంచంద్రబాబు ప్రభుత్వం అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పగించిన సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీ సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. మూసీ ప్రాజెక్టు దక్కించుకొన్న మెయిన్‌హార్ట్‌లో కూడా ఈయనకు ప్రధాన వాటాలు ఉన్నాయి. ఈ ఈశ్వరన్‌కు పాండ్యన్ మంచి మిత్రుడు. ఈ క్రమంలోనే పాండ్యన్‌తో చంద్రబాబుకు కూడా మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఏపీ రాజధాని అమరావతి నగరాభివృద్ధికి కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అండదండలు ఇస్తామంటూ హామీనిచ్చింది. దీన్ని ధ్రువపరుస్తూ.. గత జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబు పాండ్యన్‌తో సమావేశమవ్వడం, అనంతరం అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడటం గమనార్హం.

మోదీ డ్రీమ్ ప్రాజెక్టులకు మెయిన్‌హార్ట్ దన్ను

గుజరాత్‌లోని నర్మదా నది ఒడ్డున ప్రపంచంలోనే ఎత్తయిన పటేల్ విగ్రహం (స్టాట్యూ ఆఫ్ యూనిటీ), యూపీలోని గ్రేటర్ నోయిడా-ఆగ్రా మధ్య ఆరు లేన్ల యమున ఎక్స్‌ప్రెస్ వే, అదే యూపీలోని తన నియోజకవర్గం వారణాసిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వారణాసి ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ తన డ్రీమ్ ప్రాజెక్టులంటూ ప్రధాని మోదీ తరుచూ చెప్తూ ఉండేవారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ మెయిన్‌హార్ట్ కంపెనీనే చేపట్టడం గమనార్హం. మెయిన్‌హార్ట్‌కు ఈ ప్రాజెక్టులు దక్కడంపై బీజేపీ పెద్దల రాయబారం ఉండొచ్చన్న అనుమానాలూ లేకపోలేదు. మోదీ కలల ప్రాజెక్టులను పూర్తిచేసిన కంపెనీపై విమర్శలు వ్యక్తం చేస్తే, బీజేపీ అధిష్ఠానానికి ఆగ్రహం కలుగుతుందేమోనన్న కారణంతోనే రాష్ట్ర నేతలు మూసీ విషయంలో 'మెయిన్‌హార్ట్'పై నోరుమెదపడంలేదా? అనే అనుమానాలను నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు.

# సమయం మంజూరు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పౌరసత్వంపై అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ కాపీని దాఖలు చేసేందుకు బీజేపీ నేత సుబ్రమణ్యస్వామికి ఢిల్లీ హైకోర్టు బుధవారం సమయం ఇచ్చింది.తాను పిటిషన్ కాపీని పొందానని, ఆ విషయంలో ప్రార్థనలు తన అభ్యర్థనలకు భిన్నంగా ఉన్నాయని స్వామి కోర్టుకు తెలియజేశారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ మరియు జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం పిటిషనర్ తన చివరి ఆదేశాలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ రూపంలో పత్రాలను దాఖలు చేయాలని కోరింది మరియు నవంబర్ 6 న తదుపరి విచారణకు అతని అభ్యర్థనను జాబితా చేసింది.రాహుల్ గాంధీ భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ తన ప్రాతినిధ్యాన్ని నిర్ణయించేలా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ)ని ఆదేశించాలంటూ స్వామి చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది.లోక్‌సభలో ప్రతిపక్ష నేత గాంధీకి వ్యతిరేకంగా తాను దాఖలు చేసిన ప్రాతినిధ్యంపై స్టేటస్ రిపోర్టును అందజేయాలని ఎంహెచ్‌ఏను ఆదేశించాలని స్వామి తన పిటిషన్‌లో కోరారు.అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయానికి తన కేసుతో ఎలాంటి సంబంధం లేదని, ప్రార్థనలు పూర్తిగా భిన్నమైనవని స్వామి మొదట సమర్పించారు.

# రాష్ట్ర హోదా కోసం తీర్మానాన్ని ఆమోదించడానికి 1వ క్యాబినెట్ సమావేశం

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌సి-కాంగ్రెస్ ప్రభుత్వం తన మొదటి క్యాబినెట్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించనుందని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బుధవారం తెలిపారు.“ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మొదటి క్యాబినెట్ సమావేశంలో, రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి కేంద్రాన్ని ఆకట్టుకునే తీర్మానాన్ని మంత్రివర్గం ఆమోదిస్తుందని నేను ఆశిస్తున్నాను. ఆ తర్వాత ప్రభుత్వం ఆ తీర్మానాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలి' అని అబ్దుల్లా ఇక్కడ విలేకరులతో అన్నారు.ఢిల్లీలో కాకుండా జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం సజావుగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.“మనకూ ఢిల్లీకూ తేడా ఉంది. ఢిల్లీ ఎప్పుడూ రాష్ట్రం కాదు. ఢిల్లీకి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ హామీ ఇవ్వలేదు. జమ్మూ కాశ్మీర్ 2019కి ముందు ఒక రాష్ట్రం. మాకు ప్రధానమంత్రి, హోం మంత్రి మరియు ఇతర సీనియర్ మంత్రులు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తారని వాగ్దానం చేసారు, వారు JK -“ డీలిమిటేషన్, ఎన్నికలు మరియు ఆ తర్వాత రాష్ట్ర హోదాలో మూడు అడుగులు వేస్తామని చెప్పారు.“డీలిమిటేషన్ జరిగింది, ఇప్పుడు ఎన్నికలు కూడా జరిగాయి. కాబట్టి, పునరుద్ధరించాల్సిన రాజ్యాధికారం మాత్రవే మిగిలి ఉంది, ”అన్నారాయన.కొత్త JK ప్రభుత్వం మరియు కేంద్రం మధ్య సమన్వయం అవసరం ఎంత ముఖ్యమైనదని అడిగిన ప్రశ్నకు, NC నాయకుడు న్యూఢిల్లీతో ఘర్షణతో ఏమీ సాధించలేమని చెప్పారు.“ముందు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం. ఈ ప్రశ్న ముఖ్యమంత్రిని వేయాలి. న్యూఢిల్లీతో సత్సంబంధాలు ఉండాలి. ఆయనకు (సీఎం) నా సలహా ఏమిటంటే.. కేంద్రంతో ఘర్షణ పడి ఎలాంటి సమస్యలను పరిష్కరించుకోలేం.

'బీజేపీని వ్యతిరేకిస్తూనే ఉంటాం'

‘‘మేము బిజెపి రాజకీయాలను అంగీకరిస్తామని లేదా బిజెపి మా రాజకీయాలను అంగీకరిస్తుందని కాదు. బీజేపీని ఎదిరిస్తూనే ఉంటాం కానీ, కేంద్రాన్ని ఎదిరించడం మా బలవంతం కాదు' అని అన్నారు.“ఇది %జీఖ% యొక్క ప్రయోజనం కోసం మరియు %జీఖ% యొక్క ప్రజలు కేంద్రంతో మంచి సంబంధాన్ని కలిగి ఉండటానికి ఉపయోగపడుతుంది” అని అబ్దుల్లా అన్నారు.“ప్రజలు ఘర్షణకు ఓటు వేయలేదు. ఉద్యోగాలు కావాలి, అభివృద్ధి కావాలి, రాష్ట్ర పునరుద్ధరణ కావాలి, కరెంటు, ఇతర సమస్యలు పరిష్కరించాలనుకోవడం వల్లే జేకే ప్రజలు ఓటు వేశారని, న్యూఢిల్లీతో ఘర్షణ పడి పరిష్కారం జరగదని ఆయన అన్నారు.ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించడానికి ఎన్‌సి గురువారం శాసనసభా పక్ష సమావేశాన్ని పిలుస్తుందని అబ్దుల్లా చెప్పారు.“నేను %చీజ% అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాతో మాట్లాడాను మరియు పార్టీ రేపు శాసనసభ పక్ష సమావేశాన్ని పిలుస్తుంది. ఆ తర్వాత కూటమి భాగస్వామ్య పక్షాల సమావేశం జరుగుతుందని, అక్కడ కూటమి నాయకుడిని ఎన్నుకుంటామని, ఆ తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు దావా వేయడానికి రాజ్‌భవన్‌కు వెళ్తామని ఆయన అన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో ఉంచండి.”పీడీపీతో సంకీర్ణ చర్చలపైసంకీర్ణ ప్రభుత్వంలో పిడిపి భాగమవుతుందా అనే ప్రశ్నకు, ప్రస్తుతానికి దానిపై చర్చలు లేవని ఎన్‌సి నాయకుడు చెప్పారు.“పిడిపి మాతో ఎలాంటి విధానం చేయలేదు. మేము



వారి వద్దకు ఎటువంటి విధానం చేయలేదు. ఈ ఎన్నికల ఫలితాలను బట్టి, వారికి చాలా ఎదురుదెబ్బ అని నేను భావిస్తున్నాను, ఈ సమయంలో నేను అంతర్గతంగా కొంత చర్చ జరుగుతున్నట్లు అర్థం చేసుకోవచ్చు.“ఏదో ఒక సమయంలో, కమ్యూనికేషన్ ఛానెల్ తెరిస్తే, మేము కూర్చుని వారితో మాట్లాడతాము. కానీ ప్రస్తుతానికి అది మాకు ప్రాధాన్యత కాదు, ”అని అతను చెప్పాడు.అబ్దుల్లా మాట్లాడుతూ, తాను ప్రజల ఆదేశంతో వినయపూర్వకంగా ఉన్నప్పటికీ, అది వారిపై ఉంచే బాధ్యత గురించి కూడా తనకు బాగా తెలుసు.“2018 నుండి JK ప్రజలు వినకుండా పోయారు. ఇప్పుడు మనం JK ప్రజల ప్రయోజనం కోసం పని చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కాశ్మీర్ మరియు జమ్మూ మధ్య తీవ్ర విభజన ఉందని, అందువల్ల జమ్మూ ప్రజలకు యాజమాన్యం అనే భావాన్ని కల్పించే ప్రధాన బాధ్యత రాబోయే ప్రభుత్వానికి ఉంటుందని కూడా నాకు బాగా తెలుసు, ”అని ఆయన అన్నారు.రాబోయే కొద్ది రోజుల్లో వచ్చే ప్రభుత్వం NC లేదా కూటమి ప్రభుత్వం కాదు, లేదా కూటమికి ఓటు వేసిన వారి ప్రభుత్వం కాదు, ఇది %జీఖ% యొక్క ప్రతి ఒక్కరి ప్రభుత్వం, వారు ఎవరికి ఓటు వేసినా, లేదా వారు ఓటు వేసినా సంబంధం లేకుండా, NC నాయకుడు చెప్పారు.“ఈ సంకీర్ణంలో ఎమ్మెల్యేల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రభుత్వంలో యాజమాన్యం మరియు స్వరం అందించడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది” అని ఆయన చెప్పారు.ఎల్‌జీ ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసే అంశంపై, ఎన్‌సీ ఉపాధ్యక్షుడు మనోజ్ సిన్హాకు “ఎందుకంటే ఆ ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసినా, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదు” అని సలహా ఇచ్చారు.“ప్రతిపక్షంలో కూర్చోవడానికి మీరు ఐదుగురు ఎమ్మెల్యేలను మాత్రమే నామినేట్ చేస్తారు మరియు అప్పుడు మేము సుప్రీంకోర్టును ఆశ్రయించవలసి ఉంటుంది మరియు దానిపై కేసు వేయవలసి ఉంటుంది. కేంద్రంతో సత్సంబంధాలు నెలకొల్పాలని కోరుకుంటున్నప్పటికీ, ఈ చర్య మొదటి రోజు నుంచే ఉద్రిక్తతను సృష్టిస్తుంది.ఐదుగురు ఎమ్మెల్యేల నామినేషన్ ప్రభుత్వ ఏర్పాటుపై ఎలాంటి ప్రభావం చూపదు. ఎన్నికల్లో గెలిచిన కొందరు స్వతంత్రులు ఇప్పటికే మాతో టచ్‌లో ఉన్నారని, వారు మాతో కలిసి మా ఆధిక్యాన్ని పెంచుకుంటామని చెప్పారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేయడం వల్ల బీజేపీకి ఎలాంటి లాభం ఉండదు.


# మంత్రులూ ఎందుకింత మౌనం? సురేఖకు సపోర్ట్ ఎక్కడ?



హైదరాబాద్,రాజకీయాల్లో ఇచ్చి పుచ్చుకోవడం అనే అలవాటు అలవరుచుకోవాలి. సొంత పార్టీ నేతలకు కష్టం వస్తే కచ్చితంగా అండగా నిలబడాలి. కాని తెలంగాణాలో సీన్ రివర్స్ అవుతోంది. మంత్రి కొండా సురేఖ ఒంటరిగా కనపడుతున్నారు. సాధారణంగా తెలంగాణా కాంగ్రెస్ నేతల్లో దూకుడు తక్కువ. అందుకే వేరే పార్టీలో ఉన్న మాస్ లీడర్ రేవంత్ రెడ్డికి రెడ్ కార్పెట్ పరిచింది కాంగ్రెస్ అధిష్టానం. సీనియర్లకు కోపం వచ్చినా రేవంత్ వచ్చిన తర్వాతనే కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. 2018 లో మిస్ అయినా 2023 లో గురిపెట్టి కొట్టారు.కాంగ్రెస్ ను విజయలక్ష్మి వరించడంలో రేవంత్ పాత్రే మేజర్. ఇప్పుడు రేవంత్ సీఎంగా ఎవరూ ఊహించని దూకుడు ప్రదర్శిస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఏపీలో పార్టీని ఇలాగే భుజాన మోసేవారు. ఆ తర్వాత పంజాబ్ లో కెప్టెన్ అమరీందర్ సింగ్, మధ్యప్రదేశ్ లో కమల్ నాథ్ దూకుడుగా ఉండేవారు. ఇక కర్ణాటకలో డీకే శివకుమార్ ది కూడా దాదాపు ఇదే నైజం. జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ కూడా దూకుడు స్వభావం ఉన్న నేతే. ఇక చాన్నాళ్ళ తర్వాత మళ్ళీ రేవంత్ రూపంలో ఆ పార్టీకి మాస్ లీడర్ దొరికారు. ఎవరేమన్నా రేవంత్ చూసుకుంటారు అనే ధీమానో ఏమో గాని చాలా మంది మంత్రులు కూడా సైలెంట్ గా ఉంటున్నారు.కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎందుకో సైలెంట్ అయ్యారు. ఉత్తమ కుమార్ రెడ్డికి సౌమ్యుడిగా పేరుంది. అన్ని పార్టీలతో ఆయనకు స్నేహ సంబంధాలు ఉంటాయి. ఇక పొంగులేటి మాస్ లీడర్ అయినా మాటల్లో దూకుడు తక్కువ. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లాంటి నేతలకు ప్రజల్లో ఆదరణ ఉన్నా మాస్ లీడర్లు కాదు. సీతక్క అప్పుడప్పుడు ఘాటుగా మాట్లాడినా ఆమె ఓ పద్ధతి ఫాలో అవుతారు. బీఆర్ఎస్ నేతలకు గట్టిగానే సమాధానం ఇస్తూ ఉంటారు. కాని రేవంత్ టీం రాసిచ్చిన ప్రసంగాలు చదువుతారు అనే విమర్శ ఆమెపై అప్పుడప్పుడు వస్తూ ఉంటుంది.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల మాత్రమే ఇప్పుడు రేవంత్ కేబినెట్ లో దూకుడుగా ఉన్నారు. ఇక కొండా సురేఖ%8%కోపంలో విసిరిన మాటల బాణాలు తిరిగి ఆమెకే తగిలేలా కనపడుతున్నాయి. ఎటు తిరిగి ఈ భారం మొత్తం రేవంత్ మోయ్యాల్సిన పరిస్థితి ఉంది. రైతు రుణమాఫీ జరగలేదు అంటే మాట్లాడరు%8% హైడ్రా ఎందుకో ప్రజలకు వివరించే ప్రయత్నం చేయరు, మూసీ విస్తరణ, శుద్ధి ఎందుకో మాట్లాడరు. అసలు మూసి మురికితో ఇబ్బంది పడేది నల్గొండ ప్రజలే. అక్కడి ఎమ్మెల్యేలు కూడా ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు.ఇప్పుడు కొండా సురేఖ విషయంలో కూడా మౌనమే ఎంచుకున్నారు. వాస్తవానికి కేటిఆర్ మాటల్లో దూకుడు, సోషల్ మీడియాలో పోస్ట్ లు దారుణంగా ఉన్నాయి. ఈ విషయంలో సురేఖకు బీజేపి నుంచి మద్దతు వచ్చింది. రఘునందన్ రావు కోర్ట్ కు కూడా వెళ్తా అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఎలాగూ మాట్లాడలేరు. కనీసం మంత్రులైనా ఆమెకు మద్దతు ఇవ్వడమో మీరు అన్నారు కాబట్టే ఆమె అన్నారు అనడమో క్షమాపణ చెప్పారు కదా అని సమర్థించడమో%8% ఆమె పరువును బీఆర్ఎస్ సోషల్ మీడియా తీసింది కాబట్టి కేటిఆర్ పై పరువు నష్టం వేస్తామనో ఏ ఒక్కటి మాట్లాడటం లేదు. సీతక్క మినహా ఇతర మంత్రులు ఎవరూ కొండా సురేఖకు మద్దతు ఇవ్వలేదు. మరి ఈ మౌనం ఎన్నాళ్ళో ఆ నేతలే ఆలోచించుకోవాలని కాంగ్రెస్ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కొనసాగితే 2019లో టీడీపీ 2028లో కాంగ్రెస్.

# బాబు టార్గెట్ రీచ్ అయినట్లేనా ?


విజయవాడ:ఏపీ అంటే చంద్రబాబు డెఫినిషన్ వేరేగా ఉంటుంది. ఏ అంటే అమరావతి, పీ అంటే పోలవరం. ఈ రెండూ ఎందుకు అంటే బాబుని చరిత్రలో నిలిపే ప్రాజెక్టులు. అమరావతి రాజధాని ఒక కొలిక్కి వస్తే చంద్రబాబు చిరకీర్తిని అందుకుంటారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ని తన హయాంలో పూర్తి చేస్తే బాబు సీఎంగా శాశ్వతమైన పేరుని సాధిస్తారు.చిత్రమేంటి అంటే అమరావతి చంద్రబాబు బ్రెయిన్ చైల్డ్. ఆయన కలల రాజధాని. ఆయన అపర విశ్వామిత్ర సృష్టి. దాని మీద మొత్తం హక్కుభుక్తాలు పేటెంట్ రైట్స్ అన్నీ ఆయనకే ఉన్నాయి. కానీ పోలవరం తీరు అలా కాదు, అది 1940లో వచ్చిన ఆలోచన. 1980లో అప్పటి సీఎం అంజయ్య చేతుల మీదుగా పునాది రాయి వేసుకున్న ప్రాజెక్ట్. ఆ మీదట 2004లో సీఎం అయిన వైఎస్సార్ ఏలుబడిలో అన్ని రకాల అనుమతులతో కదలిక వచ్చిన ప్రాజెక్ట్.వైఎస్సార్ కలల ప్రాజెక్ట్ గా కూడా పోలవరం చెప్పుకోవాలి. ఆయన దాని గురించే ఎక్కువగా మాట్లాడేవారు. ఆయన హఠాన్మరణంతో పోలవరం కొంత వెనకబడింది. విభజన ఏపీకి పోలవరం జాతీయ ప్రాజెక్ట్ గా విభజన చట్టంలో చేర్చడం, తొలి సీఎం గా చంద్రబాబు రావడంతో పోలవరం విషయంలో బాబుకు మంచి అవకాశం వచ్చింది. ఆయన అయిదేళ్ళ టెర్మ్ లో పోలవరం ప్రాజెక్ట్ బాగానే సాగింది.ఇక 2019లో జగన్ సర్కార్ దాని మీద ఫోకస్ పూర్తిగా పెట్టి ఉంటే బాగుండేది అన్నదీ ఉంది. రెండు లక్షల 73 వేల కోట్ల రూపాయలు కేవలం సంక్షేమ పథకాల కోసం అప్పులు చేసి మరీ వెచ్చించిన జగన్ సర్కార్ అందులో పదవ వంతు పెట్టినా తన తండ్రి కలల ప్రాజెక్ట్ పోలవరం పూర్తి చేసి ఉండేవారు అన్న మాట కూడా ఉంది.ఇక వైసీపీకి వచ్చిన ఆ గోల్డెన్ చాన్స్ అలా మిస్ అయింది. మళ్ళీ బాబు వద్దకే పోలవరం వచ్చింది. దీనిని బట్టి చూస్తుంటే బాబుకే ఈ ఘనత అని చరిత్ర చెప్పినట్లుగానే ఉంది. దాంతో బాబు పోలవరం అమరావతి విషయంలో గట్టి పట్టుదలగానే ఉన్నారు.ఆయన తాజాగా ఢిల్లీ టూర్ లో పోలవరానికి పాత బకాయిలు కింద 800 కోట్ల రూపాయలు, అలాగే అడ్వాన్స్ కింద మరో రెండు వేల కోట్ల రూపాయలు నిధులను తెచ్చుకోగలిగారు. దాంతో ఈ ఏడాది ఆఖరులో పోలవరం డాయాఫ్రం వాల్ నిర్మాణం పనులు స్టార్ట్ అవుతాయి. అది కనుక పూర్తి అయితే వచ్చే ఏడాది నాటికి




పోలవరం ప్రాజెక్టు ఒక కొలిక్కి వస్తుంది.ఆ మీదట నిర్వాసితులకు పునరావాస ప్యాకేజిని కూడా తగినంత నిధులను తెచ్చి పూర్తి చేయగలిగితే పోలవరం డ్యాములలో గోదావరి నీళ్ళను నింపుకోవచ్చు. ఆ విధంగా శతాబ్ద కాలం నాటి పోలవరం కలను పండించుకోవచ్చు. ఇదీ బాబు ఆలోచనగా ఉంది. అయితే పునరావాస ప్యాకేజికి చాలా ఎక్కువ నిధులు అవసరం అవుతాయి. కేంద్రాన్ని ఒప్పించి తెచ్చుకునే సామర్థ్యం అయితే బాబుకు ఉందని అంటున్నారు.ఇక అమరావతి రాజధాని వ్యవహారం తీసుకుంటే ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులు సాగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు పదిహేను వేల కోట్ల రూపాయల నిధులలో కొంత ఈ ఆర్థిక సంవత్సరం అయ్యేలోగా ఇచ్చేందుకు ఓకే చెప్పిందని అంటున్నారు. కేంద్రం కూడా పూచీకత్తుగా ఉండడంతో తొందరలోనే నిధులు వస్తాయి. దాంతో నిర్మాణ పనులు మొదలవుతాయి.దానితో పాటు అమరావతి రాజధానికి ఏపీలోని అన్ని జిల్లాలను కలుపుతూ జాతీయ రహదారులు పూర్తి చేయాలని బాబు కేంద్రాన్ని కోరారు. అలాగే సౌత్ ఇండియాలోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరులను కలుపుతూ రైల్ కనెక్టివిటీని కూడా ఆయన కోరారు. ఇలా అమరావతి విషయంలో బాబు తన ఫోకస్ ని ప్రయారిటీని కేంద్రానికి చెప్పి ఒప్పించగలిగారు అని అంటున్నారు మొత్తానికి బాబు టార్గెట్ ని రీచ్ అయ్యారని ఢిల్లీ టూర్ సక్సెస్ అయింది అని అంటున్నారు.

# కాంగ్రెస్‌కు కలసి రాని ఒంటరి పోరు

న్యూఢిల్లీ,అక్టోబర్9: హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేక పోయింది. ఇందుకు కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకోవడం లేదు. కేవలం ఇవిఎంలపైననో లేదా మోడీపై ననో విమర్శలు చేస్తూ తప్పించుకోవడం కుదరదు. ఓటమికి కారణాలను కనుగొనాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి. అదేపనిగా మోడీని తిడుతూ కూర్చుంటే గెలవలేమని గుర్తించాలి. రాజకీయాల తీరు తెన్నులు మారేలా నడుచుకోవాలి. అప్పుడే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది. త ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగంతో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయింది. ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో ... బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆ రాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు



కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీ తో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి. హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లో వారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయాని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది. ఈ తరహా రాజకీయాలు కాకుండా కలిసి పోరాడే విధంగా పార్టీని బలోపేతం చేసుకోవాలి. కులరాజకీయాలు, కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టాలి. సమిష్టి రాజకీయాలకు పెద్దపీట వేయాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగలిగితేనే మంచి ఫలితాలు వస్తాయి.

# అమిత్ షా టార్గెట్ వెనుక వ్యూహం ఏంటీ?



హైదరాబాద్,"2026 మార్చ్ 31 నాటికి దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకలిస్తాం" కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రతిజ్ఞ ఇది. సాధారణంగా మావోయిస్ట్ ల విషయంలో ఆర్మీ రంగంలోకి దిగదు. కాని అబూజ్మడ్ అభయారణ్యంలో జరుగుతోన్న అంతిమ యుద్ధంలో ఆర్మీ పరోక్షంగా రంగంలోకి దిగుతోంది. గతంలో సిఆర్పీఎఫ్ లేదంటే కోబ్రా దళాలు పని చేసేవి. ఆ రెండింటి కంటే కీలక పాత్ర గ్రేహౌండ్స్ దళాలది. మావోయిస్ట్ లపై ఆర్మీ దిగడం అనేది తమ దేశ పౌరులను ఆర్మీతో చంపించినట్టే అనే రీతిలో భావించేవాళ్ళు. అందుకే ఆర్మీని గత రెండు దశాబ్దాలలో రంగంలోకి దించలేదు.కాని ఇప్పుడు బస్తర్, బీజాపూర్, నారాయణపూర్, కంకేర్, గడ్చిరోలి సహా 7 జిల్లాల్లో ఉన్న అబూజ్మడ్ అభయారణ్యంలో ఆర్మీ ట్రైనింగ్ సెంటర్లు భారీ ఎత్తున ఏర్పాటు అవుతున్నాయి. ఇప్పటికే చత్తీస్ఘడ్ ప్రభుత్వం నారాయణపూర్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాసి సర్వే కూడా చేయించాలని ఆదేశించింది. ఇక ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంప్ ను బీఎస్ఎఫ్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ సహా ఇతర కంపెనీల బలగాలు ఏర్పాటు చేస్తున్నాయి. భారీ ఎత్తున అడవుల్లో సెల్ టవర్ లు, హెలిప్యాడ్ నిర్మాణాలు కమ్యూనికేషన్ హబ్ లు ఏర్పాటు చేయడం మొదలుపెట్టారు.ఇదంతా అన్నలపై పోరు కోసమే కేంద్రం చేస్తోంది. బీఎస్ఎఫ్ ను రంగంలోకి దించడం ఒక ఎత్తు అయితే ఆర్మీ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం మరో ఎత్తు. అంతు చిక్కని కొండలతో ఉండే అభయారణ్యంలో ఇది ఓ సాహసమే. 30 వేల మంది కూడా లేని పీపుల్స్ గెరిల్లా ఆర్మీని ఎదుర్కోవడానికి దాదాపు లక్ష మందితో కూడిన బలగాలు దిగుతున్నాయి. వారి కోసం దాదాపు 20 వేల ద్విచక్ర వాహనాలను, పెట్రోల్ ట్యాంక్ లను కూడా పంపిస్తున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఎన్కౌంటర్లో బలగాలు ద్విచక్ర వాహనాలతోనే వెళ్ళాయి.అసలు ఇప్పుడు ఇదంతా ఎందుకు అంటే%8% వచ్చే ఎన్నికల్లో బీజేపికి అనుకూల పవనాలు అయితే ఉండకపోవచ్చు. అందుకే కేంద్రం కూడా బిల్లులు ప్రవేశపెట్టే విషయంలో ఒకటికి వంద సార్లు ఆలోచిస్తుంది. పీవోకే ని స్వాధీనం చేసుకునే ఆలోచన కూడా ఆపింది. హర్యానా సహా కీలక రాష్ట్రాలను బిజెపి కోల్పోయే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు అమిత్ షా వామపక్ష తీవ్రవాదాన్ని బిజెపి అణచివేసింది, మావోయిస్ట్ ల ముప్పు నుంచి దేశాన్ని విముక్తి చేసింది అనే నినాదంతో ఎన్నికలకు వెళ్లేందుకు సిద్దమవుతున్నారు.ఆ లోగా అనుకున్న లక్ష్యాన్ని అమిత్ షా అందుకుంటే మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్, తెలంగాణా, బీహార్, సహా పలు రాష్ట్రాల్లో బిజెపికి బలం పెరుగుతుంది. గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందిస్తే కచ్చితంగా తమ వైపు తిరుగుతారు అనే ధీమాలో కూడా అమిత్ షా ఉన్నారు. అసలు ఏదీ జరగకపోయినా, ఎన్నికల్లో ఓడిపోయినా మావోయిస్ట్ లను తుడిచిపెట్టిన ఘనత అమిత్ షాకే దక్కుతుంది. కొండపల్లి సీతారామయ్య చత్తీస్ఘడ్ లో వేసిన పునాదిని కదిల్చే సాహసం చేస్తున్న అమిత్ షాకు ఇది రాజకీయంగా కచ్చితంగా బలం చేకూర్చే అంశమే. అందుకే ఈ విషయంలో హోం మంత్రి వెనకడుగు వేయడం లేదు. మావోలకు రెండే ఆప్షన్ లు ఇచ్చారు, లొంగిపోవడం లేదా చచ్చిపోవడం. భవిష్యత్తులో బలగాల దాడులు ఇంకా కఠినంగా ఉంటాయనేది సోమవారం అమిత్ షా మరింత క్లారిటీ ఇచ్చారు. కాబట్టి అంతిమ యుద్ధం ఏ స్థాయిలో ఉండబోతుందో చూడాలి.

# కాంగ్రెస్‌కి అతివిశ్వాసం మితిమీరింది..



హర్యానా: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇచ్చాయి. హస్తం పార్టీ అంచనాలను తలకిందలు చేస్తూ.. బీజేపీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఈ అనూహ్య ఫలితాలతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ వైఖరిపై మిత్రపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తన భాగస్వామ్య పక్షాలను హస్తం పార్టీ పట్టించుకోలేదని మండిపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి అతివిశ్వాసం మితిమీరిందని విమర్శిస్తున్నాయి.తాజా పరిణామాల నేపథ్యంలో త్వరలో దేశ రాజధాని ఢిల్లీలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రియాంకా కక్కర్ మాట్లాడుతూ.. తన భాగస్వామ్య పక్షాలను హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదని మండిపడ్డారు. వారికి అతివిశ్వాసం మితిమీరిపోయిందని, ఆ కారణంగానే ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో ఎక్కువ సీట్లు ఇచ్చినప్పటికీ హర్యానాలో ఆప్, సమాజ్ వాదీ పార్టీకి కాంగ్రెస్ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. అతివిశ్వాసంతో ఉన్న కాంగ్రెస్, అహంకార బీజేపీపై పోటీ చేసే సామర్థ్యం తమ పార్టీకి ఉందని ప్రియాంకా కక్కర్ అన్నారు.

## 30 మేకలను దొంగిలించిన దొంగలు

జనగామ,తెలంగాణలో దసరా పండగ అంటేనే మందు, మాంసంతో ఎంజాయ్ చేస్తారు. అందరి ఇళ్లలో పండగ రోజు మటన్, మద్యం లేకుండా ఉండదు. పండగ కోసం అప్పు చేసి మరీ.. కొనుకుంటారు. ఇదిలా ఉంటే.. మార్కెట్‌లో ఈ సమయంలో మేకలకు, గొర్రెలకు డిమాండ్ ఎక్కువ. ఒక్కో మేక, గొర్రె మామలు సమయం కన్నా.. వెయ్యి రెండు వేలు ఎక్కువనే పలుకుతుంది. ఎంత డిమాండ్ ఉన్నా.. కొనకుండా మాత్రం ఉండరు. అమ్మకందారులైతే.. పండగ సీజన్ అదునుగా చూసి ఎక్కువ ధరకు అమ్ముతుంటారు. ఏదో విధంగా అయితే.. దసరా పండగ రోజు మాత్రం ఇంట్లో మటన్ కర్రీ ఉండాల్సిందే..జనగామ జిల్లాలో దొంగలు హల్చల్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీరప్ప గడ్డలో కెమిడి లక్ష్మయ్యకు చెందిన 30 మేకలను గుట్టుచప్పుడు కాకుండా కొట్టం నుండి అర్థరాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. పండగ సమయంలో జిల్లాలో మేకల దొంగతనం కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై బాధితుడు లక్ష్మయ్య పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు వాటి విలువ ఉంటుందని ఆవేదన చేందుతున్నాడు. కాగా.. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దొంగలను వెతికే పనిలో ఉన్నారు.

# బీజేపీ బలం కాంగ్రెస్ !

హర్యానా:హర్యానాలో భారతీయ జనతా పార్టీ గెలుపు చూసిన తర్వాత రాజకీయాల్లో గెలవాలంటే లాటరీ సాధ్యం కాదని%8% ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంటే ప్రత్యామ్నాయంగా ఉన్న తమకే ఓట్లేస్తారని ఆశపడటంలో అర్థం ఉండదని తేలిపోయింది. హర్యానాలో ప్రజాభిప్రాయం ఎన్నికలకు ముందే చాలా స్పష్టంగా కనిపించింది. బీజేపీపై తీవ్ర వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కానీ గెలుపు తీరాలకు చేరిపోయింది.

బీజేపీపై వ్యతిరేకతతో తమకే ఓట్లేస్తారని కాంగ్రెస్ భావన

ప్రభుత్వ వ్యతిరేకత వల్ల తాము గెలిచేస్తామని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ అనుకుంది. అందుకే రాజకీయ సమీకరణాలను పట్టించుకోలేదు. హోరాహోరీగా జరిగిన పోరులో గెలుపును దూరం చేసిన కొన్ని స్థానాల్లో ఐదు వందల ఓట్ల తేడాతోనే సీట్లు కోల్పోయారు. అంటే.. ఎలక్షనీరింగ్ ను కాంగ్రెస్ పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేసింది. ఓట్లు చీలిపోకుండా చేసుకోవడంలో విఫలం అయింది. అది మాత్రమే కాదు సొంత పార్టీ నేతల్లో ఐక్యత కూడా సాధించలేకపోయింది.

బీజేపీపై వ్యతిరేకత ఉన్నా కాంగ్రెస్‌కు ఓట్లేయని జనం

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజా వ్యతిరేకత ఉంది కానీ ఆ పార్టీ ఓడిపోవడం లేదు. యూపీలో రెండు సార్లు గెలిచారు. ఉత్తరాఖండ్ లోనూ అంతే. హర్యానాలో మూడో సారి గెలిచారు. గుజరాజ్‌లో గెలుస్తూనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అతి కష్టం మీద ఒక్కసారి గెలిచినా నిలబెట్టుకోలేకపోయింది. గత ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని చెప్పుకున్నా గెలిచింది. ఈశాన్య రాష్ట్రాల్లోనూ వరుసగా గెలుస్తూ వస్తోంది. అధికార



వ్యతిరేకత కారణంగా ఒక్క కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లో మాత్రమే అధికారం కోల్పోయారు. కేంద్రంలో వరుసగా మూడో సారి గెలిచారు. ఈ విజయాలకు కాంగ్రెస్ లాటరీ మీద ఆధారపడి పోరాడకపోవడమే కారణం.

ప్రజల్లో పలుకుబడి లేని నేతలతో కాంగ్రెస్ ఏం చేయగలుగుతుంది ?

బలమైన, వ్యూహ రచనలో దిట్ట అయిన ప్రత్యర్థి ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అంతకు మించి ఆలోచించాలి. జైరాం రమేష్ లాంటి ప్రజల్లో పలుకుబడి లేని నేతలతో వ్యూహరచన చేసుకుని పాత పద్దతుల్లో బీజేపీపై ప్రజలకు కోసం వస్తే మాకే ఓట్లు వేస్తారని రాజకీయాలు చేస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుంది. కాంగ్రెస్ పార్టీనే ప్రత్యర్థిగా ఉన్నంతకాలం ఇక బీజేపీకి ఢోకా ఉండదని హర్యానా ఎన్నికల ఫలితాలు నిరూపిస్తున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com